క్లుప్తంగా

బాస్కెట్‌బాల్ పోటీలకు కస్తూరిబా బాలిక



సాత్వికను అభినందిస్తున్న హెచ్‌ఎం మాదవి

ఏలూరు రూరల్ : జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాల విద్యార్థిని ఎస్ సాత్విక ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు కె.మాదవి ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి 18 వరకు చిత్తూరులో జరిగిన అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో సాత్విక ప్రతిభ చాటి, రాష్ట్ర జట్టుకు ఎంపికైందని పేర్కొన్నారు. ఈ నెల 2 నుంచి 9 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరిగే 50వ జాతీయ సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని వివరించారు.

వెండి, నగదు అపహరణ

ఏలూరు టౌన్: వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన కుటుంబం ఇంటికి తాళాలు వేసి ఊరెళ్లి కొద్ది రోజుల అనంతరం వచ్చి చూసేసరికి నగదు, వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. ఏలూరు తూర్పువీధి చినగంగానమ్మ గుడి ప్రాంతానికి చెందిన షేక్ అసీనా బేగమ్ (42) ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. సెప్టెంబర్ 22న విజయవాడ నున్నలోని సోదరి ఇంటికి వెళ్లారు. తిరిగి బుధవారం రాత్రి ఇంటికి చేరుకుని చూసే సరికి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని బీరువా కూడా పగులగొట్టి ఉంది. ఇంట్లోని రూ.50 వేల నగదు, 12 తులాల వెండి వస్తువులు, ఒక టీవీని దొంగలు అపహరించుకుపోయారు. బాధితురాలు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే గేట్ రోడ్డులో ట్రా'ఫికర్'

- కలగా పవర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణం
- ఎన్నో ఏళ్లుగా ఎదురు చూపులు
- గేటు పడితే నరకం చూస్తున్న ఏలూరు వాసులు



ఏలూరు పవరుపేట రైల్వే గేటు



పవర్‌పేట రైల్వే గేటు రోడ్డు

ఏలూరు (టూటౌన్): ఏలూరు పవర్‌పేట రైల్వే గేట్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది. ఈ రోడ్డుకు ఇరువైపులా వివిధ రకాల షాపులు ఉండటం, రోడ్డు వెడల్పు చేయాలంటే పెద్ద మొత్తంలో భూమి సేకరించాల్సి రావడం, వ్యాపారులు అభ్యంతరం పెడుతుండటం వంటి కారణాలతో ఏలూరు కర్రల వంతెన నుంచి పవర్‌పేట రైల్వే గేటు మీదుగా ఫ్లై ఓవర్ నిర్మాణం కల సాకారమయ్యేనా అని నగర ప్రజలు వాపోతున్నారు. దశాబ్ద కాలం క్రిందట ఈ ప్రాంతంలో ఫ్లై ఓవర్ నిర్మాణానికి ప్రజలు డిమాండ్ చేయడంతో అప్పట్లో ప్రతిపాదనలు కూడా తయారు చేశారు. ఇది ఖర్చుతో కూడుకున్న విషయం కావడంతో ప్రతిపాదనలు ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదు.

పావు గంటకు ఒకసారి గేటుకు మూత

ఏలూరు వన్ టౌన్ నుంచి టూటౌన్‌కు రాకపోకలు సాగించాలంటే పవర్‌పేట రైల్వే గేటు దాటాలి. రైళ్ల సంఖ్య పెరగడంతో ప్రతి పావు గంటకు గేటు మూసేయడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోతుంది. గతంలో శ్రీనివాసా థియేటర్ వద్ద అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించినా, అది పూర్తి స్థాయిలో అవసరాలను తీర్చలేకపోతుంది. చినుకు పడితే చాలు ఆ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి మూత పడుతుంది. దీంతో ఇటు పవర్‌పేట గేటులోంచి లేదా ఓవర్ బ్రిడ్జిపై నుంచి టూటౌన్‌కు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. అదే కర్రల వంతెన నుంచి పవర్‌పేట రైల్వే గేటు మీదుగా ఫ్లై ఓవర్ నిర్మిస్తే చాలా వరకు ట్రాఫిక్ సమస్య తీరుతుందని నగర వాసులు చెబుతున్నారు.

అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలో ప్రమాదాలు

నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గతంలో నిర్మించిన స్నేహ వారధి అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలో నుంచి నిత్యం నీరు వస్తుండటం, వచ్చిన నీటిని మోటార్‌తో బయటకు తోడటం పరిపాటిగా మారింది. దీనికి తోడు కొద్ది పాటి వర్షానికే అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలోకి వర్షం నీరు చేరి రాకపోకలు బంద్‌చేస్తున్నారు. ప్రతి నిత్యం ఈ మార్గంలో నీరు ఉబికి వస్తుండటంతో ఈ మార్గం అంతా నాచుపట్టి జారుడు గుణాన్ని కలిగి ఉంటుంది. దీంతో నిత్యం ఏదో ఒక ప్రమాదం సంభవిస్తుంది. ఈ అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని నిర్మించినా దానికున్న మైనస్‌లు కారణంగా నగరంలో పూర్తిస్థాయిలో ట్రాఫిక్ సమస్య తీరలేదు.



ఏలూరు జీఎన్‌టీ రోడ్డును కలుపుతూ నిర్మించిన కర్రల వంతెన

ఫ్లైఓవర్ నిర్మించాలి



ఎంతో కాలంగా ఏలూరు నగర వాసులు ఎదురు చూస్తున్న పవర్‌పేట రైల్వే గేటు మీదుగా ఫ్లై ఓవర్ నిర్మాణం తక్షణం చేపట్టాలి. దీన్ని నిర్మిస్తే వన్‌టౌన్ నుంచి టూటౌన్‌కు, టూటౌన్ నుంచి వన్‌టౌన్‌కు రాకపోకలు సులభమవుతాయి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలకులు పనులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– చలమల సత్యనారాయణ, బీజేపీ, మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఏలూరు

నష్టం కలిగించవద్దు



పవర్‌పేట రైల్వేగేటు మీదుగా ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇదే సమయంలో పవర్‌పేట రైల్వే గేటు రోడ్డులోని వివిధ వర్గాల వ్యాపారుల ప్రయోజనాలు కాపాడాల్సిన అవసరం ఉంది. స్థానిక వ్యాపారులకు నష్టం కలుగకుండా ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మాణం తక్షణం చేపట్టాలి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఏలూరు

మహిళ మెడలో మంగళ సూత్రాల చోరీ

ఏలూరు టౌన్: ఏలూరు శాంతినగర్ ప్రాంతంలో రోడ్డుపై నడిచివెళుతున్న మహిళ మెడలోని మంగళసూత్రాన్ని స్కూటీపై వచ్చిన ఇద్దరు ఆగంతకులు లాక్కుని పరారయ్యారు. త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు శాంతినగర్ 5వ రోడ్డుకు చెందిన సింగిరెడ్డి సునీత సెప్టెంబర్ 30న రాత్రి 7.30 గంటల సమయంలో బయట నుంచి 5వ రోడ్డులోని తన ఇంటికి నడుచుకుంటూ వెళుతుంది. ఇద్దరు యువకులు స్కూటీపై వచ్చి ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ఎక్కడ అని అడిగారు. ఆమె అడ్రస్ చెప్పగా, ముందుకు వెళ్లిన వారిద్దరూ ఆకస్మికంగా వెనక్కి వచ్చి ఆమె మెడలోని ఐదు కాసుల బంగారు మంగళ సూత్రం గొలుసును తెంపుకుని పారిపోయారు. బాధితురాలు ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దైవ దర్శనానికి వెళ్లి అదృశ్యం

ఏలూరు టౌన్: విజయవాడ కనకదుర్గమ్మ గుడికి దర్శనానికి వెళుతున్నానని చెప్పి ఇంట్లోంచి వెళ్లిన ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన వ్యక్తి ఆచూకీ లేకపోవటంతో భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు తూర్పువీధి పిచ్చుకుంట ప్రాంతానికి చెందిన లంకపల్లి దుర్గారావు (33) సీలింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సెప్టెంబర్ 28న ఉదయం 6 గంటలకు విజయవాడ కనకదుర్గమ్మ గుడికి వెళుతున్నానని భార్య కృష్ణవేణితో చెప్పి వెళ్లాడు. అనంతరం అతను రాత్రికి ఇంటికి రాకపోవటం, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉండడంతో భార్య ఆందోళనకు గురైంది. ఆమె బుధవారం రాత్రి ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

3న మానూరులో గ్రామసభ

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం మానూరు గ్రామంలో ఈ నెల 3న ర్యాలీ, గ్రామ సభ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు అన్నారు. రీ సర్వే పనులపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. రైతులంతా హాజరు కావాలని కోరారు.

జిల్లా మహా సభలపై ప్రచారం

దెందులూరు: రైతు సమస్యలు శాశ్వత పరిష్కారానికి, ప్రణాళిక కోసం రైతు సంఘం జిల్లా మహా సభలు నిర్వహిస్తున్నామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం దెందులూరులో జిల్లా ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30, 31 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో ఏపీ రైతు సంఘం జిల్లా మహా సభలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులు అధిక సంఖ్యలో హాజరై జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మహిషాసురమర్దనీ నమస్తుభ్యం



సౌభాగ్యలక్ష్మి



శనివారపుపేట కనకదుర్గమ్మ



పత్తేబాద కనకదుర్గమ్మ



సోషల్ వర్కర్ రామకృష్ణను సత్కారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం వివిధ ఆలయాల్లో అమ్మవార్లకు విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అమ్మవార్లకు మహిళలు సామూహిక కుంకుమ పూజలు, అష్టోత్తర శతనామ పూజలు చేశారు. సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మి, శనివారపుపేట, పత్తేబాద కనకదుర్గమ్మవారు మహిషాసురమర్దని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తపేట 12 పంపుల సెంటరులోని కనకదుర్గమ్మ ఆలయంలో సోషల్ వర్కర్ గొంతిన రామకృష్ణను మహిళలు సత్కరించారు.

మహిళల ఆరోగ్యంతో కుటుంబం బలోపేతం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): మహిళ ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే కుటుంబమంతా ఆరోగ్యవంతంగా ఉంటుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులోని వెయిటింగ్ హాలులో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆమె బీపీ, డయాబిటిక్ పరీక్షలు చేయించుకున్నారు. ప్రతి 6 నెలలు లేదా సంవత్సరానికి ఒక్కసారైనా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్ ద్వారా మహిళలకు ఉచితంగా అన్నిరకాల వైద్య పరీక్షలు చేస్తున్నట్టు చెప్పారు. రక్తదాన శిబిరాన్ని, వైద్య పరీక్షల వాహనాలను, ప్రచార రథాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు చోదగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, ప్రతినిధులు, డీఎంహెచ్‌ఓ పీజే అమృతం, డీసీహెచ్‌ఎస్ పాల్‌సతీష్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

కామవరపుకోట: ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలని 10 రోజులుగా నాయక కులస్తులు దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని కమ్యూనిస్టు నాయకులు టీవీఎస్ రాజు, అందుగుల ఫ్రాన్సిస్ తెలిపారు. ఈ ప్రాంతంలో నాయక కులస్తులు ఎంతో కాలంగా ఎస్టీ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని, వాటిని ఇప్పుడు ఆపడం దారుణమన్నారు.

పోలీసుల సూచనలు పాటించండి

పెదపాడు: పోలీసుల సూచనలు పాటించి ప్రమాదాలు, దొంగతనాలు జరగకుండా చూడాలని సీఐ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం మండలంలోని కలపర్రు టోల్ ప్లాజా వద్ద మైక్ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహరాష్ట్ర, రాజస్థాన్ వంటి ప్రాంతాలకు చెందిన దొంగల ముఠాలు సంచరిస్తున్నట్లు దొంగతనాలు జరుగుతున్నాయని విస్తృత ప్రచారం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అనుమానస్పద రీతిలో ఎవరైనా సంచరిస్తే 112 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఫోన్ నంబర్లు 944079 6635, 94407 96654, 94406 96637 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	48	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	50	బీన్సచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	38
బెండకాయలు	30	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	50	కంద	00
కాకర కాయలు	36	బీట్‌రూట్	44
బీరకాయలు	36	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-96
క్యారెట్	46	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	42	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	10
గోరుచిక్కుడు	46	గోంగూర	07-10
దోసకాయలు	30	పుదీనా	05
ఆనబకాయ (1)	30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	10
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	19
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	0
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	6
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	6
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	0
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	1
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	1
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	2
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	10
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

ప్రతిభకు ప్రోత్సాహం ఎన్‌ఎంఎంఎస్

15 వరకు దరఖాస్తు గడువు



విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్ అందజేస్తున్న దాత (ఫైల్)

గణపవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పించడానికి ఏటా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మెరిట్ కం మీన్స్ స్కీం)కు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఈ నెల 15 వరకు పెంచడం విద్యార్థులకు వరం. తొలుత ఈ గడువు సెప్టెంబర్ 30తో ముగిసినా పలు రాష్ట్రాల్లో దసరా సెలవుల కారణంగా పిల్లలు ఈ పరీక్షకు దరఖాస్తు చేసు కోలేక పోవడాన్ని గుర్తించిన కేంద్రం దర ఖాస్తు చేసుకోవడానికి గడువును అక్టోబర్ 15 వరకు పొడిగించింది. ఈ పరీక్షకు హాజరయ్యే వారిలో ఎక్కువ మంది గ్రామీణ విద్యార్థులే కావడం వారికి ఇంటర్‌నెట్ సదుపాయం అందుబాటులో లేకపోవడం, స్మార్ట్ ఫోన్లలో దరఖాస్తు చేయడంపై సరైన అవగాహన లేకపోవడం, దరఖాస్తు చేయడానికి అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందకపోవడం, తదితర కారణాలతో విద్యార్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోలేక తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. మంగళవారం రాత్రి దరఖాస్తు గడువు పెంచడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధిస్తే విద్యార్థులకు ఆర్థికంగా భరోసా లభిస్తుంది. అర్హత సాధించిన వారికి కేంద్ర ప్రభు త్వం ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు రూ.48 వేలు ఆర్థిక సాయం అందజేస్తుంది. అయితే వీరు నాలుగేళ్ల పాటు చదివితేనే సహాయం అందుతుంది. ఇందు కోసం ప్రతి ఏటా ఆయా విద్యా సంస్థ నుంచి ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపాల్ ధృవీకరణ చేసి రెన్యువల్ చేయాల్సి ఉంటుంది.

180 మార్కులకు పరీక్ష

ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్ష తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పరీక్ష నిర్వహిస్తారు. విద్యా ర్థులు తమకు ఇష్టమైన భాషను ఎంచుకోవచ్చు. మొదటి విభాగంలో అభ్యర్థుల సామర్థ్యాలను అంచనా వేసే మెంటల్ ఎబిలిటీ, రీజనింగ్‌పై పరీక్ష ఉంటుంది. రెండో విభాగంలో 7, 8 తరగతులకు సంబంధించి సైన్సు, సోషల్, గణితంలో ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో విభా గానికి 90 మార్కుల చొప్పున మొత్తం 180 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.

దరఖాస్తు ఇలా..

ప్రభుత్వ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. గతంలో దరఖాస్తు సమయంలోనే ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు అప్‌లోడ్ చేసి, పరీక్ష ఫీజు ఆ రోజే ఆన్‌లైన్‌లోనే చెల్లించాల్సి ఉండేది. కాని ఈ ఏడాది కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. పరీక్ష తేదీ నాటికి వీటిని సిద్ధం చేసుకోవచ్చు. పరీక్ష ఫీజు కూడా ఈ నెల 16లోగా చెల్లించే వెసులుబాటు కల్పించారు. దరఖాస్తుతోపాటు విద్యార్థి ఫొటో, వ్యక్తిగత వివరాలు ఉంటే సరిపోతుంది. పరీక్ష ఫీజు ఓసీ, బీసీలకు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 చెల్లించాలి. దరఖాస్తుదారు కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.3.50 లక్షల లోపు ఉండాలి. పరీక్ష డిసెంబర్ 7వ తేదీన ఉంటుంది.

ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి



ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఎక్కువ మంది విద్యార్థులతో దరఖాస్తు చేయించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రస్తుతం ఈ నెల 15వ తేదీ వరకు గడువు పెంచినందున ఉపాధ్యాయులు ఈ విషయంపై దృష్టి సారించాలి. గత ఏడాది బువ్వనపల్లి హైస్కూలు నుంచి ఇద్దరు, నిడమర్రు హైస్కూలు నుంచి ఒకరు, పెదనింద్రకొలను హైస్కూలు నుంచి 9 మంది ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్ షిప్పుకు అర్హత సాధించారు. ఈ ఏడాది ఎక్కువ మంది విజయం సాధించేలా ప్రత్యేక తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం.

– అనూరాధ, ఎంఈఓ-1

సర్వీసు రహదారిపై ప్రయాణించాలి

పెదపాడు: భవానీ భక్తులు సర్వీసు రహదారిపై ప్రయాణించాలని అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ కాలినడకన వెళుతున్న భవానీ భక్తులకు నీరు, అల్పాహారం, మజ్జిగ కలపర్రు టోల్ ప్లాజా వద్ద పంపిణీ చేశారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పలు ప్రాంతాల నుంచి విజయవాడకు వెళుతున్న భవానీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాజశేఖర్ డీటీఆర్బీ మధు పాల్గొన్నారు.